

‘డీఆర్‌డీఏ’లో ఇంటి దొంగలు..!

- రాపూరు మండలంలో భారీగా నిధుల స్వాహా
- బోగస్ రుణాలు ఇచ్చి రూ.కోట్లు తినేసిన వైనం
- వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగిన బాగోతం
- కింది నుంచి పైస్థాయి వరకు పంపకాలు
- కలెక్టర్ ఆదేశాలతో అవినీతి బట్టబయలు
- థర్డ్ పార్టీ విచారణ చేస్తే వెలుగులోకి మరిన్ని అక్రమాలు

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చదువు రాని మహిళలు కదా...? మనమేం చేసినా వారికి ఏం తెలుస్తుందిలే అన్న ధైర్యం.. పేదల సొమ్మే కదా మనం తినేసినా ఎవరూ అడిగేవారు లేరులే అన్న బరితెగింపు.. వెరసి డీఆర్డీఏలో భారీ అవినీతి..! రాపూరు మండలంలో జరిగిన ఈ కుంభకోణం సంచలనంగా మారింది. రూ.వందలు, వేలు కాదు.. ఏకంగా రూ.కోట్లు ప్రజాధనాన్ని దిగమింగారు. ఈ కుంభకోణంలో కింది స్థాయి సీసీల నుంచి పైస్థాయి అధికారుల వరకు భాగస్వాములైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండడం కలకలం రేపుతోంది. పొదుపు సమాఖ్యల ద్వారా గ్రామీణ మహిళలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఉన్నత లక్ష్యం. అందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి రుణాలను మంజూరు చేస్తున్నది. అయితే ఈ సమాఖ్యలు అవినీతికి కేంద్రంగా మారుతున్నాయి. వీటిని పర్యవేక్షించే సీసీలు, ఏపీఎంల దగ్గర నుంచి డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే అధికారుల వరకూ ప్రతీ ఒక్కరూ ఈ అక్రమాలకు ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందిస్తుండడంతో ప్రభుత్వం లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. రాపూరు మండ లంలో ఉన్నతి, స్త్రీనిధి, సీఐఎఫ్ పథకాల కిందనున్న నిధులను దుర్వినియోగం చేశారు.



● బోగస్ రుణాలతో స్వాహా

ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్‌ప్లాన్ నిధులను రుణాలుగా మంజూరు చేశారు. అలానే స్త్రీనిధి పథకం కింద వడ్డీలేని రుణాలను ఇచ్చారు. అయితే పుస్తకాల్లో మాత్రం పలానా మహిళలకు రుణాలు ఇచ్చినట్లు రాసుకున్నారు తప్ప, వాస్తవానికి వారికి రుణాలు ఇవ్వలేదు. వారి పేరుతో బోగస్ రుణాలను మంజూరు చేసి డీఆర్‌డీఏ సిబ్బందినే ఆ నిధులను స్వాహా చేశారు. ఆఖరుకు యానాది సమాఖ్యను కూడా వదలకపోవడం గమనార్హం. యానాదులకు చెందాల్సిన నిధులను కూడా దిగమింగారు. చాలాకాలం నుంచి ఈ తంతు జరుగుతున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో అవినీతి పతాకస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి రాపూరులో తిష్ట వేసిన ఓ ఉద్యోగి ఈ అవినీతిలో కీలక పాత్రధారి అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంఘాల నిర్వహణకు ఇచ్చే సీఐఎఫ్ నిధులు కూడా మింగేసినట్లు సమాచారం. పుస్తకాల్లో లెక్కలు చూపిస్తున్నప్పటికీ అకౌంట్లలో మాత్రం డబ్బులు లేవని తెలుస్తోంది. ఏపీఎం, డీపీఎం, డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు అవినీతిపరులకు సహకరిస్తుండడంతో ఇంతకాలం ఈ భాగోతం వెలుగులోకి రాలేదు.

● కలెక్టర్ ఆదేశాలతో బట్టబయలు

రాపూరు మండలంలో పొదుపు సమాఖ్యల మాటున జరిగిన ఈ అవినీతి బాగోతం కలెక్టర్ ఆదేశాలతో బట్టబయలైంది. కొందరు స్థానికులు ఈ అవకతవకలపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. దీనిపై స్పందించిన కలెక్టర్. గతేడాది నవంబరులో డీఆర్‌డీఏ పీడీను విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో తొమ్మిది మంది అధికారులు, ఉద్యోగులను ఒక విచారణ కమిటీగా పీడీ నియమించారు. ఈ కమిటీ మూడు నెలల పాటు విచారణ జరిపింది. ఈ విచారణలో అనేక అక్ర మాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ సొమ్మును వివిధ రూపాల్లో స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు. ఆ తర్వాత కలెక్టర్ నిర్ణయం కీలకం కానుంది.

● థర్డ్ పార్టీతోనే వాస్తవాలు వెలుగులోకి..!

ఒక్క రాపూరు మండలంలోనే సుమారు రూ.3 కోట్ల వరకూ నిధులను తినేసినట్లు ప్రచారం జరుగుతోంది. చాలా కాలం నుంచి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నా అధికారులెవరూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజాగా డీఆర్‌డీఏ పీడీ నియమించిన కమిటీ విచారణ జరిపినా ఇంకా అనేక వ్యవహారాలను గుర్తించలేదన్న ప్రచారం జరుగుతోంది. ఇక ఈ కమిటీ విచారణను చాలా ఆలస్యం చేయడం కూడా అనేక అనుమా నాలకు తావిస్తోంది. కలెక్టర్ కూడా పలుమార్లు నివేదిక గురించి అడిగితే తప్ప విచారణ పూర్తి చేయలేదని డీఆర్ డీఏ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ కమిటీలోని కొందరికి రాపూరులోని అవినీతితో పరోక్ష సంబంధం ఉందని, కాబట్టి వారి ద్వారా జరిపే విచారణ పారదర్శకంగా ఉండదని ఓ ఏపీఎం స్థాయి ఉద్యోగి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఏసీబీ చేత విచారణ జరిపించాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీతో విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవకతవకలు గుర్తించాం

రాపూరు మండలంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపాం. ప్రత్యేక కమిటీని నియమించి విచారణ పూర్తి చేశాం. నిధుల దుర్వినియోగానికి సంబంధించి అవకతవకలు జరిగాయని గుర్తించాం. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

ఇంటర్‌లో సమూల మార్పులు

- ఏప్రిల్ ఒకటి నుంచి ప్రథమ సంవత్సరం ప్రవేశాలు
- నూతన పద్ధతిలో తరగతుల నిర్వహణ
- జేఈఈ, ఎంసెట్‌పై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(విద్య), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన పద్ధతుల్లో తరగతుల నిర్వహణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ విద్యలో రెగ్యులర్ తరగతులతో పాటు జేఈఈ, ఎంసెట్‌లకు విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు. విద్యా ప్రమాణాల్లో మార్పులతో పాటు అడ్మిషన్ల సంఖ్యను పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచే తరగతులు ప్రారంభించనున్నారు.

● ఒకటి నుంచే విద్యాసంవత్సరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కొత్తబాట పట్టనుంది. ఇప్పటి వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిశాక ప్రభుత్వ కళాశాలలకు సెలవులు ఇచ్చి తిరిగి జూన్‌లో కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభించేవారు. సెలవుల్లో మాత్రం ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోయేవి. చదువుల్లో సైతం వీరే ఆధిక్యాన్ని ప్రదర్శించడంతో ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడిపోయేవారు. ఈ విషయాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలతో ఈ ఏడాది మార్పులు, చేర్పులు చేస్తూ ఏప్రిల్ ఒకటి నుంచే కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభిస్తోంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించడంతో పాటు ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లను చేపట్టనున్నారు. టెన్త్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23వతేదీ వరకు తరగతులు, ప్రవేశాలు నిర్వహించి ఏప్రిల్ 24 నుంచి జూన్ 1వతేదీ వరకు సెలవులు ప్రకటిస్తారు. తిరిగి జూన్ 2 నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభం కానున్నాయి దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశంతో పాటు త్వరగా ప్రారంభించి తరగతులు నిర్వహించడంతో 15శాతం సిలబస్ కూడా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ సిలబస్ మొత్తం కూడా అక్టోబరు, నవంబరు నాటికి పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే సైన్స్ గ్రూప్ విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ అందించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్ శిక్షణ అందించనున్నారు.



● జిల్లాలో 71 ప్రభుత్వ కళాశాలలు

జిల్లాలో 24 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 11 మోడల్, 6 ఏపీఎస్‌డబ్ల్యూఆర్, 12 కేజీబీవీ, 16 హైస్కూల్ ప్లస్ కలిపి మొత్తం 71 ప్రభుత్వ కళాశాలలున్నాయి. వీటిల్లో సుమారు ఐదువేల మంది వరకు విద్యార్థులు చేరుతుంటారు. ఈ అడ్మిషన్ల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన పద్ధతులు అవలంబిస్తూ ఏప్రిల్ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. ఇందువల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రవేశాలు అనంతరం టెన్త్ ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్‌లో కొనసాగించి ఫెయిల్ అయిన వారిని తొలగిస్తామని ఆయన తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.26 (సోమవారం సాయంత్రం)
సహరి: 4.54 (మంగళవారం ఉదయం)

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలి

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరూ ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను సద్వినియోగం చేసుకుని, ఆత్మస్థైర్యంతో జీవించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులో ఆదివారం జరిగిన ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీలో వీపీఆర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు పలువురు దివ్యాంగుల చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే కోవూరు నియోజక వర్గంలో 250, ఉదయగిరిలో 150, కందుకూరులో 150, ఆత్మకూరులో 150 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందించామన్నారు. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లోనూ అందజేస్తామని తెలిపారు. ట్రై సైకిళ్లు అందుకున్న ప్రతి ఒక్కరి దగ్గరకి వెళ్లి పలకరించినప్పుడు కలిగిన ఆనందం, మధురానుభూతిగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచన, సంకల్పం కలుగుతుందన్నారు.

● సమష్టి కృషితో ఆత్మకూరు అభివృద్ధి : మంత్రి ఆనం

సమష్టి కృషితో ఆత్మకూరును అభివృద్ధి చేసి చూపుతామని, రానున్న మూడు నెలల్లో నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నామని దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని మైదానంలో నియోజకవర్గస్థాయి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగంలో ఐటీఐని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆత్మకూరులోని వంద పడకల ఆసుపత్రిని విడతల వారీగా 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటికే ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని చెప్పారు. బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బీజేపీ సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంచర్ల శ్రీహరినాయుడు, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

● వీపీఆర్ సేవలు స్ఫూర్తిదాయకం

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మనసున్న గొప్ప సేవాతత్పరుడని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కొనియాడారు. ఆదివారం ఉదయం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 60 లక్షల విలువ చేసే 150 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంటు చరిత్రలో సరికొత్త సువర్ణ అధ్యాయానికి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మంచి మనసున్న వీపీఆర్‌మన ఎంపీగా ఉండడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

క్వార్ట్జ భోక్తల అరెస్టు ?

- పోలీసుల అదుపులో ముగ్గురు వైసీపీ నేతలు
- రుస్తుం మైన్స్ కేసులో విచారణ వేగవంతం

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో బరితెగించి క్వార్ట్జను దోచుకున్న భోక్తల అరెస్టులు మొదలయ్యాయి. తొలుత రుస్తుం మైన్స్‌లో జరిగిన దోపిడీపై విచారణ ప్రారంభమైంది. ఈ కేసులో ముగ్గురు వైసీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పొదలకూరు మండలానికి చెందిన ఆ ముగ్గురు వ్యక్తులను నెల్లూరులో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో వీరి అరెస్టును చూపే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర కలకలాన్ని రేపుతోంది. ప్రస్తుతం రుస్తుం మైన్స్ కేసులో విచారణ వేగవంతంగా జరుగుతోంది. అదుపులో ఉన్న వ్యక్తులు ఇచ్చే సమాచారం ఆధారంగా మరికొంత మందిని కూడా అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2023 నవంబరు, డిసెంబరు నెలల్లో పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలో ఉన్న రుస్తుం మైన్స్‌లో కొందరు అక్రమార్కులు క్వార్ట్జను అక్రమంగా తవ్వి తరలించుకెళ్లారు. ఈ మైన్‌కు లీజు ముగియడంతో అది ప్రభుత్వ ఆధీనంలో ఉంది. రూకోట్ల విలువైన సరుకును కొల్లగొడుతుండడంతో ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాడు సత్యాగ్రహ దీక్ష చేశారు. అయినా ఒక్క అధికారి కూడా ఆ మైన్ వైపు కన్నెత్తి చూడలేదు. దాదాపు 40 లారీలు, ఎక్స్‌కవేటర్లను అప్పట్లో టీడీపీ నేతలు పట్టుకు న్నారు. క్వార్ట్జ తవ్వకాల కోసం ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను కూడా అక్కడ వినియో గించారు. ఒక లారీలో ఉన్న ఈ భారీ పేలుడు పదార్థాలను కూడా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రాష్ట్ర సీఎస్, డీజీపీ నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీ వరకూ అందరికీ సోమిరెడ్డి ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్ప డ్డాక క్వార్ట్జ అక్రమార్కుల లెక్క తేల్చే పని చేప ట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల మైనింగ్ డీడీ బాలాజీనాయక్ పొదలకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జను తరలించుకెళ్లారని, వీరిపై చర్యలు తీసుకో వాలంటూ వైసీపీ నేతలు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై గత నెలలో పొదల కూరు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అప్పటి నుంచి లోతుగా విచారణ జరుపుతున్న పోలీసులు.. పక్కా ఆధారాలతో తాజాగా ముగ్గురు వైసీపీ నేతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

భూగర్భ డ్రైనేజీకి రూపాయి చెల్లిస్తే చాలు

నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ తీసుకున్న వారు రూపాయి మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఆదివారం నెల్లూరులో పలు ప్రాంతాల్లోని పార్కులు, పాఠశాలలను ఆయన పరిశీలించారు. బోడిగాడుతోట వద్దనున్న సమాధుల తోటలో పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడే 200 మంది సామర్థ్యం కలిగిన కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మూలాపేటలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్కూలు మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రముగ్ధం విష్ణుదేవ గానం

- కొనసాగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) ,మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పుర మందిరంలో జరుగుతున్న 60వ త్యాగరాజ స్మరణోత్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన కేఎస్ విష్ణుదేవ్ నంబూద్రి కచేరీ సంగీత ప్రియులను మంత్ర ముగ్ధులను చేసింది. ఆయన పలు కీర్తనలు ఆలపించి, చివరిగా శ్రీరంగనాథుని కొలుస్తూ శ్రీరంగపుర విహారా అనే కృతిని గానం చేసి భక్తులను పులకింపజేశారు. స్థానిక ఔత్సాహిక కళాకారులు ఉదయం 9 నుంచి రాత్రి 7గంటల వరకు త్యాగరాజస్వామి కృతులను ఆలపించారు. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారం, పూజలు జరిగాయి. కళాకారులను స్మరణోత్సవ సభ కార్యవర్గం సత్కరించింది.



గాత్ర కచేరీ చేస్తున్న విష్ణుదేవ్ నంబూద్రి

సవాల్‌గా మారిన చోరీలు

- మెట్టలో వరుస దొంగతనాలు
- హడలుతున్న ప్రజలు
- నామమాత్రంగా గస్తీలు

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఇటీవల చోరీలు అధికమయ్యాయి. తాళం వేసిన ఇళ్లు, ఆలయాలే లక్ష్యంగా చేసుకుని దొంగలు దోపిడీలకు తెగబడుతున్నారు. విలువైన బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు, వాహనాలను అపహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా నియోజక వర్గంలో ఏదో ఒకచోట ప్రతిరోజూ చోరీలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

\- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గంలోని సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో శివారునున్న ఆలయాల్లో చోరీలకు దుండగులు పాల్పడుతున్నారు. హుండీలను ధ్వంసం చేసి నగదు, బంగారు, వెండి నగలు దోచుకెళుతున్నారు. అంతేకాక నివాసాలు, బహిరంగ ప్రదేశాల్లో నిలిపిన మోటార్‌బైక్‌లను చోరీ చేస్తున్నారు. ఉదయగిరిలోని బాలాజీనగర్, కోళ్లవీధి, అగ్రహారం, బీసీ కాలనీలతోపాటు దుత్తలూరు, వరికుంటపాడు, వింజ మూరు, కొండాపురం, వింజమూరు మండలం నందిగుంట గ్రామాల్లో తాళాలు వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి భారీగా నగలు, నగదు అపహరించుకెళ్లారు. ఇటీ వల ఉదయగిరిలోని ఓ బంగారం దుకాణంలో మహిళలు నకిలీ బంగారాన్ని విక్రయించి రూ.2.50 లక్షల విలువైన అసలు బంగా రాన్ని దోచుకెళ్లారు. ఇవేకాక పోలీసుల దృష్టిక రాని చోరీలు ఇంకా అనేకం ఉన్నాయి.



● నామమాత్రంగా గస్తీ

పోలీసులు రాత్రి గస్తీ నామమాత్రంగానే సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం వాహనానికి సైరన్ వేసుకొని ప్రధాన రహదారులపై వెళుతూ బీట్ పాయింట్లను మాత్రమే సందర్శించి వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఐడీ పార్టీ ఉందా, చోరీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తిస్తున్నారా ? అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్థానికుల సహాయంతో పట్టణాలు వదిలి, పల్లెప్రాంతాలపై కన్నేసి తరుచూ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనికితోడు నియోజకవర్గంలో ఇటీవల జాతీయ రహదారుల నిర్మాణం జరగడంతో దొంగల రాకపోకలకు అనువుగా ఉందని చెప్పుకోవాలి. అయితే పోలీసులు ప్రధాన కూడళ్ల, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, చోరీలపై అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో సమాచారం అందివ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా దొంగలు వారి పని వారు చేసుకుపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి, నివారించాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరిలో నకిలీ బంగారం ఇచ్చి ఒరిజనల్ బంగారు తీసుకెళ్లిన మహిళలు(ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 100000
వెండి ఒక గ్రాము	రూ.103.00

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున కందుకూరు సబ్ డివిజన్‌లో బెట్టింగ్‌లపై నిఘాపెట్టామని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన పాతనేరస్తుల వివరాలను సేకరించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంపులు గుంపులుగా కూర్చుని సెల్‌ఫోన్‌లు చూస్తూ బెట్టింగ్‌లు వేస్తున్నా గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

నాగవరపమ్మకు శాంతి హోమం

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న నాగవరపమ్మకు ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. ఉదయం వెండి నాగేంద్రస్వామి, అమ్మవారి విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొలుపు కార్యక్రమం జరిగింది.

పేదలకు వైద్య పరీక్షలు

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల ఎస్సీ కాలనీలో ఆదివారం డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూరాలజీ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. పేదలకు హైపర్‌టెన్షన్, డయాబెటిస్, మతిస్థిమితం (ఎపిలెప్సీ), స్ట్రోక్, నూరాలజికల్ వ్యాధుల డాక్టర్ బిందుమీనన్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ వార్షికోత్సవం

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో బాలికల హాస్టల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలికల హాస్టల్‌లో ఇంజనీరింగ్, డిప్లమో, డిగ్రీ నర్సింగ్ విద్యార్థినులు వార్షికోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్‌లను విద్యార్థులు సత్కరించారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

లింగసముద్రం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం నారాయణ చెప్పారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు, మద్యం అక్రమ రవాణా, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మజ్జిగ, పండ్లు పంపిణీ

కందుకూరు(ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంకమ్మ దేవాలయం వద్ద నిరుపేదలు, యాచకులకు ఆదివారం మజ్జిగ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవ, పీ.ప్రభాకర్, కే.కిషోర్, జీ.చిన అల్లూరయ్య, జీ.రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు నిర్వహించి పొం గళ్లు పొంగించి నైవే ద్యం సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

అనంతసాగరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద మసీదులో ముస్లింలకు మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంత రం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. కార్య క్రమంలో ఉత్తర కాలువ చైర్మన్ మెటు కూరు కృష్ణారెడ్డి, సోమశిల డ్యాం చైర్మన్ వీ కేశవచౌదరి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, ఖాసీం బా షా, అవినాష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో వైఎస్ఆర్ ఇన్ఫోటెక్, ఆల్‌ట్రస్ట్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కావలి రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బుడంగుంటలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1990-91లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం బుడంగుంటలో జరిగింది. చౌదరిపాలెంకు చెందిన పూర్వ విద్యార్థి కోడెల క్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు కావలి దేవదానం, జి.దయాకర్‌తోపాటు ప్రస్తుత ఉపాధ్యాయులు ఐహెచ్ఎల్. ప్రసాద్, జేవీ.రామారావులను శాలువాలతో సన్మానించారు. ఈ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థుల యూనీఫాం కుట్టుకూలికి రూ.8000 అందజేశారు.

ఎంఐజీ లేఅవుట్‌లో ధర తగ్గింపునకు చర్యలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని జీప్లస్ త్రీ గృహ సముదాయాల సమీపంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్ల ధర ఎక్కువగా ఉన్నందున వాటిని సవరించాలని మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణకు విజ్ఞప్తిచేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి లే అవుట్‌ను అభివృద్ధి చేసినా ఆప్రాంతంలో లేని ధరలు పెట్టడంతో కొనుగోలుదారులు ముందుకు రాని పరిస్థితి ఉందని, దీంతో ఇతర మున్సిపాలిటీల లో పెట్టిన ధరలను పరిశీలించి తదనుగుణంగా తగ్గించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే ఈమేరకు ధరలు తగ్గిస్తూ ఆమోదం రానుందని మరోసారి ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్లు విక్రయానికి చర్యలు ప్రారంభిస్తామని వివరించారు. ప్రజలకు తక్కువ ధరకే నివాస స్థలాలు అందేలా చూడాలన్న లక్ష్యంతో ఈ ప్లాట్లు విక్రయించనున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కో సం పామూరు రోడ్డు సర్కిల్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఏరియా ఆసుపత్రి వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఓవీ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి మహదేవపురం రోడ్డు సర్కిల్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా 20 మందికి రూ.20.5 లక్షలు సీఎం సహాయనిధి మంజూరైనట్లు తెలిపారు.



ఉలవపాడు : టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారితో ఎమ్మెల్యే ఇంటూరి

టీడీపీలో వైసీపీ నేతల చేరిక

ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని వాక గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం కందుకూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన పొడమేకల చెంచయ్య, తిరుపతి, రమేష్, సుబ్బయ్య, బూచి మల్లికార్జున, సన్నిబోయి బాలయ్య, పొడమేలక కృష్ణ తదితరులకు ఎమ్మెల్యే పసుపు కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పార్టీలోని పాత, కొత్త నాయకత్వం సమన్వయంతో పార్టీ బలోపేతానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, వాయల శ్రీను, పాదాల మురళీకృష్ణ, టీ శ్రీకాంత్, పీ సుబ్రహ్మణ్యం, పాదాల జాలిరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతికి ఘన స్వాగతం

ఉలవపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు పాడి పంటలు, వ్యాపారాలతో సుభిక్షంగా ఉండాలని, హిందూ ధర్మ పరిరక్షణ కోసం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) తెనాలి సాలిగ్రామ మఠం ట్రస్ట్ నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉలవపాడుకు చేరింది. ఈ పాదయాత్ర ఉలవపాడు జాతీయ రహదారి వద్దకు చేరుకోగా మండల ఆర్యవైశ్యులు బాలస్వామీజీకి, శిష్యబృందానికి మంగళవాయిద్యాలతో, గోవింద నామస్మరణతో ఘన స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు. ఉలవపాడులో నూతనంగా నిర్మించబోయే వాసవీ కన్యకాపరమేశ్వరి ఆయల నిర్మాణ స్థలాన్ని స్వామివారు పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బావనపల్లి సుబ్రహ్మణ్యం, శివకుమార్, సత్యనారాయణ, అయ్యప్ప, శ్రీనివాసులు, గంగాధర్, హనుమంతరావు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



బాలస్వామీజీకి ఘన స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్యులు

నేడు కావలికి..

కావలి(ఆంధ్రజ్యోతి): పెనుగొండక్షేత్రం పీఠాధిపతి బాలస్వామీజీ సోమవారం కావలి పట్టణానికి వస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం కావలి ప్రెసిడెంట్ తటవర్తి రమేష్ తెలిపారు. కావలి పట్టణంలోని సబ్‌కోర్టువీధిలోని కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఆర్యవైశ్య సంఘ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతికి స్వాగత ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. సాయంత్రం బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పీఠాధిపతిచే శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రామక్రిష్ణ, నేతలు మొగళ్లపల్లి రాజ, యేల్చూరు రవి, వైభవ సురేష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

జెండా చెట్టు సెంటర్ మసీద్‌లో ఇఫ్తార్ విందు



ముస్లింలను అలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని జెండా చెట్టు సెంటర్ మసీద్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని ముస్లింలకు స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన కావలి నియోజకవర్గంలోని ముస్లింలందరికీ ముసునూరులోని తన ఇంటి వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ముస్లింలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత మహేంద్రకు ఎమ్మెల్యే అభినందన

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన ఏపీ తెలుగునాడు ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలలో టీఎన్‌టీయూసీ కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి మహేంద్రకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆ అవార్డుతో మహేంద్రను అభినందించారు. అనంతరం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంత తీసుకుంటున్న మండలంలోని చలంచర్ల టీడీపీ సీనియర్ నాయకుడు చాగంటి వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే పరామర్శించారు.

ముగిసిన జాతీయస్థాయి డబుల్స్ టెన్నిస్ పోటీలు

కావలిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కావలిలో రెండు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి డబుల్స్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. అనంతరం అఫిషియల్ క్లబ్ కోర్టు టోర్నమెంట్ కమిటీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఏఎస్పీ నాగేశ్వరరావు, జీవీకె గ్రూప్ అడ్వయిజర్ ఆదిశేషారెడ్డిలు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ కార్యదర్శి వంశీమోహన్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

● 30 ప్లస్‌లో విన్నర్‌గా కావలి జట్టు, రన్నర్‌గా హైదరాబాద్ జట్టు, 40ప్లస్‌లో విన్నర్‌గా కావలి, రన్నర్‌గా విజయవాడ, 60 ప్లస్‌లో విన్నర్‌గా హైదరాబాద్, రన్నర్‌గా కర్నాటక, 70 ప్లస్‌లో విన్నర్, రన్నర్‌గా హైదరాబాద్ జట్లు నిలిచారు.



విజేతకు కప్పు అందజేస్తున్న నిర్వాహకులు

భగత్‌సింగ్ దేశభక్తి యువతకు స్ఫూర్తి

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ దేశభక్తిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలు ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక జనతాపేటలోని భగత్‌సింగ్ విగ్రహానికి పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘ నేత తాళ్లూరు మాల్యాద్రి, జిల్లా రైతు సంఘం నేత దర్గాబాబు, సీపీఐ సహాయ కార్యదర్శి బోసు, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పొబ్బా సాయి, ఏటూరు శివ, జనసేన నేతలు తిరుమలశెట్టి సుధీర్, నాగార్జునలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమంలో వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు సుందర్, రాజకుమార్, టీ.పోతురాజు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.సురేష్‌బాబు, వై.ఆనంద్ మోహన్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మచారి, బ్రహ్మయ్య, నాగరాజు, జామవా సేవాసంస్థ వ్యవస్థాపకుడు ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పరిశీలన

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను, అలిచర్ల బంగారు పాలెం ప్రాంతంలో పెంచుతున్న (మడ్‌క్రాబ్) భారీ పీతలను ఏపీ ఫిషరీస్ కమిషనర్ రామాశంకర్ నాయక్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఫిషింగ్ హార్బర్ పరిస్థితిని జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న చెన్నై, కడలూరు, కారైకల్ ఫైస్పీడ్ బోట్లపై ఆరా తీశారు. అనుమతి లేకుండా అక్రమంగా సముద్ర చేపల వేట సాగిస్తున్న వారిపై ఎఫ్‌డీవోలకు తెలియజేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు ఎఫ్‌డీవోలు సంజయ్, శ్రీనివాసులు, స్టీఫెన్, రవికుమార్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

బిట్రగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల సావరంపై ఎస్సై బోజ్యా తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● ఉలవపాడు(ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల గ్రామం శివారుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై అంకమ్మ, సిబ్బంది దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులతోపాటు రెండు బైకులు, రెండు పందెం కోళ్లు, రూ.4980 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పేద వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

కావలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని డీఆర్ విశ్వోదయ సేవాసమితి కార్యాలయంలో ఆదివారం డీఆర్ కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డిలు 60 మంది పేదవృద్ధులకు రూ.60 వేల విలువైన నిత్యావసరాలతోపాటు కొంత నగదు అందజేశారు. విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, కే.తాతిరెడ్డి, డాక్టర్ మౌలాలి, దిల్షాద్ బేగం, సావన్, నల్లూరు రామక్రిష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 53 కోట్లతో ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి

● దేవదాయ శాఖా మంత్రి ఆనం

ఆత్మకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ శాఖ నుంచి ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 53 కోట్లు మంజూరయ్యాయని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీకి రింగు రోడ్డు నిర్మాణం, ఇంజనీరింగ్ కాలేజీ మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు ఇందూరు వెంకటరమణారెడ్డి, చంద్రా వెంకటసుబ్బానాయుడు, టీపీపీ నేతలు దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, గాలిబోయిన లక్ష్మనరసయ్య, వివిధ మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు ప్రారంభం

అనంతరం మంత్రి ఆనం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో మౌళికవసతులు, వైద్యపరికరాల ఏర్పాటు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అభివృద్ధి కమిటీ సమావేశంలో సమీక్షించారు. ముందుగా ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు మంజూరైన బ్లడ్ బ్యాంకును, వైద్యశాల సమీపంలో పోలీసుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తదితరులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఈవోపీఆర్డీ

సీతారామపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో బా గంగా మండల కేంద్రంలోని బె స్తకాలనీలో ఈవోపీఆర్డీ భార్గవి ఆధ్వర్యంలో ఆదివారం పారి శుధ్య కార్యక్రమం నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామస్తులు చెత్తను రోడ్లమీద కాని, బహిరంగ ప్రదేశాలు, డ్రైనేజీలో వేయరాదని, అతిక్రమించిన వారికి గ్రామ పంచాయతీచే జరిమానా విధించ బడుతుందన్నారు. ఇంటిలోని తడి చెత్త, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని సూచించారు. అనంతరం ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.



చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

సోమశిలలో 54.343 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 54.343 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



వింజమూరు : బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందచేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స కోసం తమ సొంత నిధులను ఖర్చు చేసుకున్న 78 మందికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంజూరు చేసిన సుమారు రూ.కోటి చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ పి చెంచల బాబుయాదవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రంగారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

పట్టణంలోని ప్రసన్నరెడ్డినగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో కంచికామకోటి మెడికల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి గుంటూరు వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే కాకర్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెంకు చెందిన కొమ్మి బసవయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన కుమారుడికి రూ.1.06 లక్షలు, అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన బోనముక్కల సుబ్బారెడ్డికి రూ.1.65 లక్షలు, మరో 9 మందికి రూ.13.75 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేశారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వయోజనులకు ఆదివారం ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏపీఎం ఖాజారంతుల్లా తెలిపారు. 19 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించగా 331 మంది వయోజనులకు గాను 329 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈపరీక్షను వయోజన విద్య పర్యవేక్షకుడు షేక్ బాదుల్లా పర్యవేక్షించారు.



ఆంధ్రావారిపల్లెలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం సుధాకర్

●దుత్తలూరు: మండలంలోని చింతలకుంటలో ఆదివారం వయోజనులకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను ఎంపీడీవో మల్లికార్జున్ పరిశీలించారు. వయోజనులను అక్షరాస్యులగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈపరీక్షలు నిర్వహిస్తోందన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): మండలంలోని వరికుంటపాడు, ఆంధ్రావారిపల్లి కేంద్రాల్లో వయోజనులకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను ఏపీఎం సుధాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వయోజనులంతా అక్షరాస్యులుగా మారాలన్నారు.

అంకమ్మకు వైభవంగా పాలపొంగళ్లు

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కందుకూరు అంకమ్మ ఆలయంలో పాల పొంగళ్ల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు చద్దులు, వడపప్పు, పానకం సమర్పించే కార్యక్రమం నిర్వహించగా ముగింపుగా అంకమ్మకు పాలపొంగళ్లు సమర్పించారు. గ్రామదేవతల ధర్మకర్త దివి లింగయ్యానాయుడు, ఇతర గ్రామపెద్దలు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరవటంతో ఆలయంలో కోలాహలం నెలకొంది. పాలపొంగళ్లు సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచే తరలిరావటంతో ఆలయ అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేయగా సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగింది.



అంకమ్మ ఆలయం వద్ద మహిళా భక్తుల బారులు



కలువాయి పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

దారి కోసం రైతుల ఆందోళన

కలువాయి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తమ పొలం వద్దకు వరికోత యంత్రం తీసుకుపోయేందుకు దారి ఇవ్వకుండా ఓ వ్యక్తి తమను ఇబ్బంది పెడుతున్నాడని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆదివారం ఆందోళన చేశారు. గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన వరి పంట కోతకు రావడంతో వరికోత యంత్రాన్ని పొలం వద్దకు తీసుకుపోయేందుకు దారి ఇవ్వకుండా మొదటిలో భూమి ఉన్న వ్యక్తి అడ్డుపడుతున్నాడని రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం ఆర్ఐ, వీఆర్వో గ్రామానికి వెళ్లి పరిశీలించారు. కాగా, అధికారుల వెంట పొలం వద్దకు వెళ్లిన తమను దారి ఇవ్వకుండా అడ్డుపడుతున్న ఆ వ్యక్తి దూషించాడని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తమ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోవడం లేదని పోలీస్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళన చేశారు. ఉన్నతాధికారులైనా తగు చర్యలు తీసుకుని తమ పంట ఇంటికి తెచ్చుకునే మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.

దస్తావేజు లేఖర్లు నిబద్ధతతో వ్యవహరించాలి

- దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక సుబ్బారావు, పక్కన జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు లేఖర్లు నిబద్ధతతో వ్యవహరించి దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించాలని రాష్ట్ర దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బా రావు పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సుబ్బారావు మాట్లాడుతూ దొంగ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల వ్యవహారం తెలిస్తే మీడియాకు, పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. దస్తావేజు లేఖరులకు లైసెన్సులు ఉన్నప్పుడు దొంగ డాక్యుమెంట్ల సమస్య ఉండేదికాదన్నారు. ఇప్పుడు ఎవరు పడితే వారు డాక్యుమెంట్ రైటర్లమని చెప్పుకుంటూ దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయించడానికి వస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 సాఫ్ట్ వేర్ వల్ల దస్తావేజు లేఖరులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ప్రైవేటు అటెండెన్సు రిజిస్ట్రేషన్, ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు సహకరించడంలేదని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో దస్తావేజు లేఖరులందరూ ఐకమత్యంతో పనిచేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్, కోశాధికారి అవ్వారు సత్యనారాయణ, స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు ఎం సీతాపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవి కుమార్, నెల్లూరు నగర అధ్యక్షుడు జేబీవీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోనలో చలువ పందిళ్ల ఏర్పాటు



రాపూరు, (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో వేసవి కాలం దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, మ్యాట్ ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం తెలిపారు. రానున్న బ్రహ్మోత్సవాల దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు బస్సులు నిలుపు స్థలం నుంచి అన్నదాన సత్రం, శ్రీవారి ఆలయం వరకు చలువ పందిళ్లు, అమ్మవారి ఆలయం ముందు మ్యాట్ పరిచినట్లు పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.


ఆందోళన కలిగిస్తున్న క్షయ

- ఏటేటా పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- జిల్లాలో 15వేల మందికిపైగా రోగులు
- ప్రతి ఏడాది మరణిస్తున్నవారు 80కి పైగానే...
- గత ఏడాది 4,055 కొత్త కేసులు
- ఉచితంగా ఖరీదైన మందులిస్తున్న ప్రభుత్వం
- అయినా అదుపుకాని వైనం
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

నెల్లూరు (వైద్యం) మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయవ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. చెడు అలవాట్ల కారణంగా ఈ వ్యాధి విజృంభిస్తున్నది. వ్యాధిగ్రస్థుల తుంపరుల కారణంగా కొందరు ఆరోగ్యవంతులు సైతం క్షయకు గురవుతున్నారు. హెచ్ఐవీ ఉన్నవారిలో 60 శాతం మందికి ఈ క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నాలుగేళ్ల క్రితమే ప్రతి లక్షమందిలో కనీసం 174 మందికి తగ్గించాలని పిలుపు నిచ్చింది. అయితే జిల్లాలో మాత్రం ఆ సంఖ్య 665కి చేరటం ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది 83,381 మంది అనుమానితులను పరీక్షించగా, అందులో 4,055 మంది క్షయవ్యాధిగ్రస్థులేనని వైద్యాధికారులు గుర్తించారు. ఇక లెక్కలోకి రానివారు, ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించే వారు ఎంతమంది ఉన్నారో లెక్కిస్తే మొత్తం మీద 15వేల మంది క్షయ వ్యాధి గ్రస్థులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదిలాఉంటే ఏటా ఈ వ్యాధివల్ల జిల్లాలో 80 మందికిపైగా మృతి చెందుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతంలో వ్యాధిగ్రస్థుల పట్ల ప్రజల్లో వివక్ష ఉండేది. అయితే ప్రస్తుతం ఈ సమస్య తొలగింది. ఈ నేపథ్యంలో మార్చి 24న (నేడు) ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని డబ్ల్యూహెచ్‌వో తీర్మానించింది.

వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం

గతంలో ఈ వ్యాధి వస్తే ప్రాణాపాయం తప్పదన్న భయం ఉండేది. ప్రస్తుతం ఈ వ్యాధి చికిత్సకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో మరణాల సంఖ్య కూడా బాగా తగ్గింది. కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణకు ఎంతో విలువైన మందులు కూడా ఉచితంగా అంద చేస్తున్నది. ఎవరైనా రోగులు ప్రభుత్వ ఆసు పత్రికి వస్తే వ్యాధితీవ్రతను పరీక్షించి వైద్యులు మందుల ను అందచేస్తారు. పూర్తికోర్సు మందులు వాడితే వ్యాధి నయం అయ్యే అవకాశం ఉంది.



క్షయవ్యాధి లోగో

92 గళ్ల పరీక్ష కేంద్రాలు

క్షయవ్యాధిని గుర్తించేందుకు ప్రభుత్వ పరంగా జిల్లాలో 92 గళ్ల పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. దీంతో పాటు 13 టీబీ యూనిట్లు కూడా ఏర్పాటు చేశారు. డామియన్ ఫౌండే షన్, నారాయణ ఆసుపత్రి లోనూ వ్యాధికి ఉచిత చికిత్సలు చేస్తారు. వీటితో పాటు ట్రూనాట్ పరీక్ష కేంద్రాలు కూడా 39 వరకు ఉన్నాయి. నగరంలోని జీజీహెచ్‌లో పత్యేకంగా సిబినాట్, జీన్‌ఎక్స్‌పర్ట్ వంటి ఆత్యా ధునిక పరీక్షలు ఉన్నాయి. వ్యాధిగ్రస్థు లకు ప్రభుత్వం 6నెలలు, 19 నెలలు, 24 నెలల పాటు వైద్య చికిత్సలు కూడా అందిస్తుంది. క్షయ వ్యాధి తీవ్రత ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్) గుర్తిం చేందుకు డామియల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని భక్తవత్స లనగర్‌లో ఆధునాతన పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాధారణ స్థాయి క్షయ వ్యాధికి ప్రత్యక్ష పర్యవేక్షణలో (డాట్స్) పదతిలో మందులతో చికిత్స అందిస్తారు. వ్యాధి తీవ్ర తను బట్టి రెండు లక్షల విలువైన చికిత్సను ఉచితంగా అందచేస్తారు.

ప్రతినెలా జిల్లా వ్యాప్తంగా 500కు పైగా గళ్ల పరీక్షలను చేసి క్షయ వ్యాధి స్థాయిని నిర్ధారిస్తున్నారు.

ముందుగానే గుర్తిస్తే ...

ఈ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించే వీలుంది. వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే మూత్ర పిండాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వెన్నుముక, మెదడు పొరలపై, గర్భసంచి, ఎముకలు, కీళ్లపై క్షయ వ్యాపిస్తే ప్రాణాలపై ఆశ వదులు కోవాల్సిందే. ఈ క్రమంలో వ్యాధి లక్షణాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

క్షయ నివారణకు కృషి



జిల్లాలో క్షయవ్యాధిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నాం. ప్రభుత్వ పరంగా ఎంతో ఖరీదైన మందులు కూడా అందిస్తున్నాం. వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం కింద వేయి రూపాయల ప్రోత్సాహం కూడా అందిస్తున్నాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి

సంవత్సరం	ప్రభుత్వం నిర్ధారణ	మరణించినవారు
2020	4958	62
2021	5597	56
2022	3804	25
2023	3898	38
2024	4055	40
2025	833	15

(ఫిబ్రవరి వరకు)

వెలుగొండ జలాల కోసం
ఉద్యమించాలి

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో మెట్ట ప్రాంతాల ప్రజలు ఉద్యమిస్తేనే వెలుగొండ జలాశయం పూర్తయి సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్ ఆవరణలో వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ జలాశయం పూర్తయితే ఆయా జిల్లాలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 25 లక్షల మంది ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. ప్రభు త్వాలు మారినా వెలుగొండ జలాశయం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. వెలుగొండతోపాటు అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ ప్రాజెక్టులు పూర్తయి మెట్ట గ్రామాల చెరువులకు నీరు నింపితే బీడు భూములు సాగులోకి వచ్చి వలసలు నివారించడంతో పాటు ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. వెలుగొండ జలాశయం పూర్తి చేసేందుకు పార్టీలకతీ తంగా రాజకీయ నాయకులతో పాటు మేధావులు, రైతులు, యువత, ఉద్యోగులు, ప్రజలు ఉద్యమిం చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి వెలుగొండ జలాశయాన్ని పూర్తి చేసి మెట్ట ప్రాంతాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసీ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథ రామి రెడ్డి, సీపీఐ, సీపీఎం, సాధన సమితి నాయకులు ప్రభాకర్, మూలం రమేష్, దామా అంకయ్య, అజయ్‌కుమార్, బసిరెడ్డి మాలకొండారెడ్డి, దస్తగిరిఅహ్మద్, ఫడ్స్ రమణయ్య, ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంప్రసాద్

సమృద్ధి భారత్, తీరప్రాంత పరిరక్షణే లక్ష్యం

- కమాండెంట్ సంజీత్‌కుమార్

కావలిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమృద్ధి బారత్, తీరప్రాంత పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా సైక్లోదాన్ ర్యాలీని చేపట్టామని షార్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజిత్ కుమార్ తెలిపారు. కోల్‌కత్తా నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ శనివారం రాత్రి కావలికి చేరింది. ఆదివారం స్థానిక జేబీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో తీర ప్రాంతాల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మొదలైన సైకిల్ ర్యాలీని డీఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. సంజిత్‌కుమార్ మాట్లాడుతూ గుజరాత్, కోల్‌కత్తా నుంచి బయలు దేరిన ఈ రెండు జట్లు కన్యాకుమారిలోని వివేకారాక్ వద్ద కలుసుకుని ర్యాలీని ముగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ వీఎన్ ప్రభాకర్, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, పట్టణ సీఐ ఫిరోజ్, రెండవ పట్టణ సీఐ గిరిబాబు పాల్గొన్నారు.



కావలి : సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

సీఐఎస్ఎఫ్ ర్యాలీకి స్వాగతం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి బయలు దేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీకి బోగోలు మండలం మంగమూరు జాతీయ రహదారి వద్ద స్థానిక ఎస్సై భోజ్యా ఆదివారం స్వాగతం పలికారు. తిప్ప జూనియర్ కళాశాల వద్ద అల్పాహారం అనంతరం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ బృందం

వెంకటాచలంలో ఘన స్వాగతం

వెంకటాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీ బృందం ఆదివారం వెంకటాచలంకు చేరుకుంది. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసు అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని సరస్వతినగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమబెంగాల్ నుంచి 50మంది సీఐఎస్ఎఫ్ బృందం సభ్యులతో కలిసి బయలుదేరిన సైకిల్ ర్యాలీ 16రోజుల్లో 1700 కిలోమీటర్లు వెళుతున్నట్లు సైకిల్ ర్యాలీ బృందం సభ్యులు తెలిపారు. ఈనెల 31వ తేది కన్యా కుమారిలో ర్యాలీ ముగుస్తుందన్నారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ ఆయుధాల నివారణ, తీవ్రవాదుల చొర బాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత కోసం సీఐఎస్ఎఫ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదంలో పేలిన తుపాకీ

- హత్యాయత్నం కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం నేపథ్యంలో హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఆచారివీధిలో రాజ్‌మల్ జైన్ నివాసం ఉంటున్నారు. ఆయనకు దిలీప్‌కుమార్, హితేష్ కుమార్, మనోజ్‌కుమార్ కుమారులు. రెండవ కుమారుడు హితేష్‌కుమార్‌కు ఆస్తిలో కొంత వాటా ఇవ్వడంతో ఆయన వివాహ అనంతరం శిఖరం వారి వీధిలో వేరుగా కాపురం ఉంటూ సుబేదారుపేటలో వ్యాపారం చేసుకుంటున్నాడు. రాజ్‌మ ల్‌జైన్, ఆ యన భార్య పెద్ద కుమారుడి వద్ద ఉంటున్నారు. అయితే హితేష్‌కుమార్ అప్పుడప్పుడు తండ్రి వద్దకెళ్లి ఆస్తి పంపకాలు చేయాలని అడిగేవాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య వివాదాలు జరుగుతుండేవి. శనివారం అర్ధరాత్రి హితేష్‌కుమార్ ఐదుగురు స్నేహితులతో కలిసి దిలీప్‌కుమార్ ఇంటికి వచ్చి తలుపులు కొట్టాడు. డోర్ తీయక పోవడంతో తన వద్ద ఉన్న పిస్టల్‌తో తలుపులను కాల్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దిలీప్‌కుమార్ ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మృతి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో నెల్లూరులోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... కొడవలూరు మండలం దామేగుంట సెంటర్‌కు చెందిన షేక్ షన్‌వాజ్(32) నగరంలోని వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్లలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆయనకు మద్యం అలవాటు ఉంది. ఆ మత్తులో మృతిచెందాడు. గమనించిన స్థానికులు ఆదివారం షన్‌వాజ్ బంధువు షేక్ రహీమాన్‌కు సమాచారం అందించారు. ఆయన నవాబుపేట పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీకాకుళం జిల్లా పలాస గ్రామానికి చెందిన పెద్దబ్బాయి(65) కూలి పనుల కోసం నెల్లూరుకు వలస వచ్చాడు. రామ చంద్రాపురంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయాడు. ఎంతకీ నిద్ర లేయకపోవడంతో ఇంటి యజమాని గమనించి ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెద్దబ్బాయి వివరాలు తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చిన్న కోతతో శస్త్రచికిత్సలు

- వైద్యనిపుణులు కిరణ్మయి, లావణ్య
- ముగిసిన ల్యాప్రోస్కోపీ, హిస్టిరోస్కోపీ వర్క్‌షాప్



శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ల్యాప్రోస్కోపీ ద్వారా కేవలం రెండు చోట్ల చిన్నపాటి కోతతో శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించవచ్చని విశాఖ పట్నానికి చెందిన డాక్టర్ కిరణ్మయి, నెల్లూరు అపోలో వైద్యురాలు డాక్టర్ లావణ్య తెలిపారు. నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ల్యాప్రో స్కోపీ, హిస్టిరోస్కోపీ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. వైద్య నిపుణులు పాల్గొని ఆధు నిక వైద్య విధానాలను తెలియచేశారు. జీజీహెచ్ గర్భకోశ వ్యాధుల విభాగం హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి ఆధ్వర్యంలో నలుగురికి ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్సలు చేశారు. సంతానం లేని వారికి రెండు డయాగ్నోస్టిక్ ల్యాప్రోస్కోపీతోపాటు రెండు హిస్టిరోస్కోపీ, గర్భాశయ నాళ నీరుగడ్డకు శస్త్రచికిత్సలు చేశారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు కూడా నిర్వహించారు. వర్క్‌షాపు విజయవంతం అయినందుకు జీజీహెచ్ సూపరింటెండెం ట్ డాక్టర్ సిద్ధానాయక్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, వర్క్‌షాపు కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాత పట్నాయక్, డాక్టర్ భవానీ, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

ఉదయగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట గ్రామ సమీపంలో వీధికుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామానికి సమీపంలోనున్న తోటల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై వీధికుక్కలు దాడి చేయడంతో దుప్పి అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు ఉదయగిరి అటవీ శాఖాధికారి బీఎస్ కుమారరాజాకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎఫ్‌బీవోలు అఫ్జల్, వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని గండిపాళెం పశు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి గన్నేపల్లి రిజర్వు ఫారెస్టులో దహనం చేశారు.

అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన లారీ

- తోపుడు బండ్లు ధ్వసం



రోడ్డు పక్కన తోపుడు బండ్ల మీదుగా పెట్రోల్ బంకులోకి తీసుకెళ్లిన లారీ

సంగం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి కూడలిలో ఓ లారీ అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బళ్లారి నుంచి కృష్ణపట్నం వెళ్తున్న లారీ మార్గమధ్యంలో సంగం కొండమీద నుంచి జాతీయ రహదారి కూడలిలోకి రాగానే కలిగిరి వైపు వెళ్తున్న మోటార్‌బైక్ అడ్డు వచ్చింది. దీంతో లారీ డ్రైవర్ బైక్‌ను తప్పించబోయి ఎడమ వైపునకు లారీని మళ్లించడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండ్లు, రెండు వరికోత మిషన్లను ఢీకొని పెట్రోల్ బంకులోకి దూసుకువెళ్లింది. ఉదయాన్నే కావడంతో కూడలిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటర్ సైకిల్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అంజనేయులు

వెంకటాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై ఆదివారం మోటర్ సైకిల్‌ను కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. నెల్లూరు నుంచి గూడూరు వైపుగా మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ అంజనేయులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

- నలుగురికి గాయాలు.

కావలి రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రెండు మోటారు బైకులు ఢీకొని నలుగురు గాయపడిన ఘటన ఆదివారం కావలి మండలం కొత్తపల్లి సమీపంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కావలి పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలలో పనిచేస్తున్న గౌతమ్, అతని సోదరి సాయికీర్తి మోటారు బైక్‌పై కావలి నుంచి కొండాపురం మండలం సత్యవేలుకు బయలు దేరారు. కావలి నుంచి కొత్తపల్లికి పరుసు కొండయ్య, ఆయన భార్య భవానీ మోటారు సైకిల్‌పై ముందు వెళుతుండగా రోడ్డు క్రాసింగ్ వద్ద వెనుక నుంచి సత్యవోలు వెళ్లే మోటారుసైకిల్ ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిన నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం గౌతమ్, సాయికీర్తిని కావలి ఏరియా వైద్యశాలకు, కొడయ్య, భవనీలను ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ.1,00,000
వెండి ఒక గ్రాము	రూ.103.00

ప్లాస్టిక్ వినియోగం ఆపండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), మార్చి23, (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా ఆపేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ వ్యాపారులకు సూచించారు. ఆదివారం నవాబుపేటలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరును ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, ఎంహెచ్‌వో చైతన్య పాల్గొన్నారు.

ఆ ముగ్గురిని ఆదర్శంగా తీసుకోవాలి

● నగరంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి ● డీవైఎఫ్ఐ కాగడాల ప్రదర్శన ● మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు (వైద్యం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వీరుల వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం నగరంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కనకమహల్ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు సాగిన ఈ ప్రదర్శనలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, నగర కార్యదర్శి బీపీ నరసిం హ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన వీర కిశోరాలు ఆ ముగ్గు రని కొనియాడారు. దేశంలో ఆకలి చావులు, మ హిళలపై అత్యాచారాలు. వేధింపులు ఎక్కువయ్యా యని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని కార్పొరేటీకరిస్తున్నా యని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జగదీష్, శేఖర్, సురేంద్ర, సుబ్బరాయుడు, కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

● ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌వో), నవయువ సమాఖ్య(ఎన్‌వైఎస్) ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనం తరం సండేమార్కెట్ సమావేశ మందిరం లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ దేవ్ వర్ధంతి సభ జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయుడు ఓంకారం అల్లూరు రాజు మాట్లాడుతూ యువత, విద్యార్థు లు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, యానాదయ్య, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

● మెగా రక్తదాన శిబిరం

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నగరంలోని అపోలో సెంటర్‌లో ఆదివా రం మెగా రక్తదాన శిబిరం జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సతీష్ మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ ఆశయాలకు అనుగుణంగా నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్, ప్రసాద్, చాంద్‌బాషా, మధు, మోష, మహిళా సంఘం నాయకులు షాషీ న్, రమణమ్మ, విద్య ఫౌండేషన్ అధినేత పత్తి రాము పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ దేశంకోసం 23 ఏళ్ల వయ సులోనే ప్రాణాలు విడిచిన భగత్‌సింగ్ పోరాటపటిమ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి షారూఖ్, నాయకులు ఖాదర్ మస్తాన్, నవీన్, చరణ్, పులిన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శనలో డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు

నెల్లూరుకు త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు

● మంత్రి పొంగూరు నారాయణ


బస్టాండులో రిబ్బన్ కట్ చేసి కొత్త కుర్చీలను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు త్వరలోనే విద్యుత్ బస్సులు వస్తున్నాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండులో శుభమస్తు ఫౌండేషన్ ఏర్పాటు చేసిన స్టీల్ కుర్చీలను ఆదివారం ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం శుభ పరిణామమం అన్నారు. భూగర్భ డ్రైనేజీ ద్వారా నగరాన్ని దోమల రహితంగా మారుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడప' రెండో విడత మొదలు

నెల్లూరు రూరల్, మార్చి23, (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడప కార్యక్రమం రెండో విడత ఆదివారం నగరంలోని 1వ డివిజన్ కోడూరుపాడులో మొదలైంది. ఆయన ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. రూరల్లో శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడంతో తమ కుటుంబానికి బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, జయరామి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, 2వ డివిజన్ జన్నత్‌హుస్సేన్‌నగర్‌లో టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు యానాదుల గోడు'

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యానాదుల గోడును ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని యానాదుల మహా కూటమి నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆ కూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో యానా దులు చాలా వెనుకబడి ఉన్నారని, వారిని ఆదుకోవాలని, యానాది కార్పొరే షన్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని, ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సరస్వతమ్మ, సుబ్బయ్య, కళావతి, ఏకొల్లు సుధీర్‌బాబు, కోటయ్య పాల్గొన్నారు.

జనసేన ఇఫ్తార్ విందు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెక్లీన్స్‌రోడ్డు రహమతీయ మసీదులో జనసేన నాయకులు గునుకుల కిషోర్, షేక్ యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో కఠిన ఉపవాసాలు ఉంటున్న ముస్లింల కొర్కెలు ఫలించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ విందులో టీడీపీ నాయకులు జకీర్, ఇంతియాజ్, జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గానికి చెందిన 18 మందికి రూ.19.95లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆమె నివాసంలో ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట టీడీపీ మండలాధ్యక్షుడు రావెళ్ల వీరేంద్రనాయుడు, అడపాల అనీష్‌రెడ్డి, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ తాళస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు

నెల్లూరు(విద్య), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముత్తుకూరురోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం డాక్టర్ బీ ఎస్ రావు మెమోరియల్ స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను డీఎస్పీ సింధుప్రియ ప్రారంభించారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా శిక్షణ పొందితే భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ఏజీఎంకే కొండారెడ్డి, ప్రిన్సిపాల్ రజని, కోచ్ ఇబ్రహీం పాల్గొన్నారు.

స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శతమానం భవతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెలలో పుట్టిన వాకర్స్‌ను సత్కరించారు. ఆయా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

5న ఉచిత ఖత్నాలు

నెల్లూరు (వైద్యం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌కేబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన నగరంలోని తాతయ్య బడిలో ఉచిత ఖత్నాల(ఒడుగులు) కార్యక్రమం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమ పోస్టర్లను ఆదివారం ట్రస్ట్‌లో కార్యాలయంలో విడుదల చేశారు. డాక్టర్ షేక్ మహమూద్ ఆధ్వర్యంలో ఖత్నాల కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ షేక్ అల్లాఉద్దీన్, సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుధీర్, ఉపాధ్యక్షుడు సంజయ్ కుమార్, రూరల్ ఇన్‌చార్జి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వ మత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమకమిటీ సభ్యులు గంపల మంజుల, రాధాయ్య, గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలమాలలు సమర్పించగా..ఆశ్రమస్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రం, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు ఆశ్రమ చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వెంకటాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సోమవారం కసుమూరు, పుంజులూరుపాడు, విక్రమ సింహపురి యూనివర్సిటీ, వెంకటాచలం గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10గంటలకు వీ ఎస్‌యూ, మధ్యాహ్నం 3గంటలకు వెంకటాచలంలో ట్రాక్టర్ల పంపిణీ, 4గంటలకు కసుమూరులో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, 5గంటలకు ఇఫ్తార్ విందులో పాల్గొంటారని, రాత్రి7గంటలకు పుంజులూరుపాడులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శిస్తారన్నారు.

కాకాణి పరామర్శ

తోటపల్లిగూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేడూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సాదేపల్లి శ్యాంసన్ శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు.విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం స్వగ్రామానికి వెళ్లి శ్యాంసన్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

విడవలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముదివర్తి మసీదులో ఆదివారం షైనార్టీ నాయకులు ఎస్.కె.రఫీ ముస్లింలతో ప్రార్థనలు చేశారు. అనంతరం ఇమాంలకు దుస్తులను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయభాను రెడ్డి, పొన్నలూరు పురందర్ రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి ఉన్నారు.


విందులో పాల్గొన్న ముస్లింలు

దీప్తి నర్సింగ్ హోంలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లోకనాథం

నెల్లూరు (వైద్యం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దీప్తి నర్సింగ్ హోంలో ఆదివారం వైద్య శిబిరం జరిగింది. జనరల్ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ లోకనాథం, ప్రముఖ గర్భకోశ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ సుమతి పాల్గొని రోగులను పరీక్షించారు. పలురకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు.

కోసూరు రత్నంకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నంకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. హైదరాబాద్ సమత గోపాల్ కళ నిలయంలో ఆదివారం జరిగిన సదస్సులో ఈ అవార్డును సంస్థ నిర్వాహకులు ప్రదానం చేసి సత్కరించారు. 20 ఏళ్లుగా 120 మంది వృద్ధులకు సేవలందిస్తున్నందుకు ఈ రికార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ప్రకటించింది.



అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించరాదు

● ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


పనుల పరిశీలనకు స్కూటర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి23, (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించరాదని, లోపాలు తలెత్తితే ఊరుకునే ప్రశ్నే లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం 21వ డివిజన్‌లో జరుగుతున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను ఆయన స్కూటీపై వెళ్లి ఆకస్మికంగా పరిశీలించారు. పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి కావాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం తన కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి 24వ డివిజన్ కనుపర్తిపాడుకు చెందిన బెల్లంకొండ చిట్టిబాబు, రాచగిరి మణి మిత్రబృందాన్ని టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను టీం రామ్‌చరణ్ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ప్రారంభించారు. టీం రామ్‌చరణ్ నెల్లూరు అధ్యక్షుడు వావిల బాలాజీ, జనసేన నాయకులు కోలా విజయలక్ష్మి, గుడ్లూరు నాగరత్నం, షేక్ ఆలియా పాల్గొన్నారు.

రామతీర్థం పర్యాటక కేంద్రం అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


రిసార్ట్స్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం పర్యాటక కేంద్రం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఆదివారం రామతీర్థం తీర ప్రాంతంలో తరంగ్ రిసార్ట్స్‌ను ఆమె ప్రారంభించారు. వసతుల కల్పనపై నిర్వాహకులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాతుడూ రామతీర్థంలో నెలకొల్పిన పర్యటక కేంద్రాన్ని తరంగ్ రిసార్ట్స్ వారికి 15ఏళ్ల లీజుకి ఇచ్చామన్నారు. కాగా పర్యటక కేంద్రంలో ఉద్యోగ అవకాశాలను కల్పించాలని స్థానికు లు ఎమ్మెల్యేను కోరారు. పర్యాటక రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. ముందుగా తరంగ్ రిసార్ట్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు హర్షవర్దన్, వెంకటేశ్వరరావు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దాసరిప్రసాద్, టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, శ్రీహరికోట గోపి, చిన్నిబాబు, తాతా రమేష్, సత్యవోలు సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతల వలస

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 23: (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతో పాటు మండలం నుంచి వైసీపీ కౌన్సిలర్లు, సీనియర్ నేతలు, నాయకులు 100మందికిపైగా టీడీపీలో చేరారు. ఆదివారం బుచ్చిలోని ఎంఎం.ఫంక్షన్ హాల్లో వారందరికీ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వా నించారు.

కవి సమ్మేళనంలో ఉగాది రుచులు

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. సమ్మేళనంలో కవులు వారి కవితల్లో ఉగాది రుచులను మేళవించి సమాజానికి చక్కటి సందేహాన్ని అందజేశారు. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్, ప్రముఖ కవి ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. పెన్నా రచయితల సంఘం కార్యదర్శి తోట సులోచన వారి తల్లిదండ్రులు పేరున కవులు మాధవ్ సుధ, నల్లు రమేష్ శేషమ్మ, హస్తి లక్ష్మణ్‌రాజుకు పురస్కారాలు ప్రదానం చేశారు. గ్రంథాలయ సంస్థకి 14 కుర్చీలు బహూకరించారు.

30న ఇరగాళమ్మ ఉగాది నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇరగాళమ్మ అమ్మవారికి శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈనెల 30న నగరోత్సవం నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమ ఆహ్వాన పత్రికలను రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, ఆలయ ఈవో గిరికృష్ణ, ఒట్టూరు సురేంద్రయాదవ్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


జంగాలపల్లి ఎస్టీ కాలనీలో పర్యటించిన జనసేన నేతలు

వెంకటాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నట్లు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఇడిమేపల్లి పంచాయతీలోని జంగాలపల్లి ఎస్టీకాలనీలో ఆయన పర్యటించి మాట్లాడారు. ఆధార్, రేషన్ కార్డులు లేని గిరిజనులను గుర్తించి వెంటనే వారికి వీటిని అందేలా చూస్తామన్నారు. అలాగే పక్కా ఇళ్లు, పించన్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు గుమ్మినేని వాణి భవానీ, పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, మణి తదితరులున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య, ఎం.సుబ్బారావు, బుజ్జయ్య, సర్దార్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలకు తక్షణ పరిష్కారం

తోటపల్లిగూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కృష్ణప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

ఉల్లాస్ పరీక్షకు 693 మంది హాజరు

పొదలకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):మండలంలో ఆదివారం చేపట్టిన ఉల్లాస్ పరీక్షకు 693మంది అభ్యాసకులు హాజరయ్యారు. మండలంలోని 45కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పొదలకూరు, బిరదవోలు కేంద్రాలను ఆదివారం అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ అజాద్, సూపర్‌వైజర్ మస్తాన్‌రెడ్డిలు పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మండలంలో 683 మందికి గతేడాది డిసెంబరు 23వ తేదీ నుంచి వీవోఏలతో చదువు నేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చిన్నయ్య, సీసీ సరోజ, వీవోఏ భాగ్యమ్మ, అంగన్‌వాడీ వర్కర్ ప్రవీణకుమారి తదితరులు పాల్గొన్నారు.


లింగంపల్లిలో పరీక్షను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్


అక్కంపేట పరీక్ష కేంద్రంలో పాల్గొన్న మహిళలు

● మనుబోలు (ఆంధ్రజ్యోతి): అక్కంపేట, మనుబోలులో నిర్వహిస్తున్న ఉల్లాస్ పరీక్షా కేంద్రాలను ఆదివారం ఉల్లాస్ డి ప్యూటీ డైరెక్టర్ ఆజాద్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండునెలలుగా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి పొదుపు సంఘాల లీడర్లతో చదువు నేర్పించామన్నారు. మండలంలోని 31కేంద్రాల్లో 455మందికి చదువు నేర్పించి పరీక్షలు రాయించామన్నారు. ప్రశ్నాపత్రాలు ఢిల్లీకి పంపి, ఉత్తీర్ణులైన వారికి కేంద్ర ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో మస్తాన్‌రెడ్డి, ఏపీఎం వనజాక్షి, సీసీ రాజేశ్వరి, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'వైద్యజ్యోతి' కార్యక్రమంలో ఉచిత వైద్యసేవలు అందించి జ్ఞాపికలు అందుకున్న వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులు

వైద్యార్తులకు దారిదీపమైన 'వైద్య జ్యోతి'

- 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహణ
- అనూహ్య స్పందనతో ముగిసిన హెల్త్‌మీట్

తిరుపతి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'వైద్యజ్యోతి' పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా హెల్త్‌మీట్.. వైద్యార్తులకు దారిదీపంలా మారింది. తిరుపతిలోని తుడా ఇందిరా మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి నగరంతో పాటు జిల్లాలోని పలుప్రాంతాలనుంచి చికిత్స కోసం, వైద్యసలహాల కోసం రోగులు పోటెత్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగిన వైద్యజ్యోతిలో దాదాపు నాలుగు వేల మంది రోగులను వైద్యులు పరీక్షించి.. అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. మందులూ ఉచితంగా అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆయా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ అర్హులైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పడంతో పాటు వైద్యసేవ పరిధిలో లేని వ్యాధులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. ఇలాంటి హెల్త్‌మీట్‌లలో అన్ని రకాల వైద్యనిపుణులను ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉండిందని రోగులు అన్నారు. భవిష్యత్తులోనూ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటామని వైద్యులు తెలిపారు. ఇక, శిబిరంలో శ్రీసాయిసుధ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తరఫున డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి పాల్గొని కంటి సమస్యతో బాధపడే రోగులను పరీక్షించి కంటి అద్దాలు అందజేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందికి 'వైద్యజ్యోతి' జ్ఞాపికలను ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి, సిబ్బంది అందజేశారు.



● నేడు వరల్డ్ టీబీ డే

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమే..!

- ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం

దగ్గే కదా అని నిర్లక్ష్యం చేస్తూ పోతే క్షయ (టీబీ)గా మారుతుంది. ఆపైనా పట్టించుకోకుంటే ప్రాణాంతకమవుతుంది. అదే.. మొదట్లోనే గుర్తి స్తే క్షయ నుంచి బయట పడొచ్చు.

జిల్లాలో దాదాపు రెండు వేల మంది వరకు క్షయ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వీరిలో 1200 మంది ప్రభుత్వ, 800 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరికి అవసరమైన మందులను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారు. క్షయ పడిన బాధితులకు నిక్షయ పోషణ కింద కేంద్ర ప్రభుత్వం పోషకాహారంతోపాటు ఆరు నెలల చికిత్సా సమయంలో రూ.6 వేలను జీవన భృతికి అందిస్తోంది. ప్రాథమిక, ఏరియా, ప్రాంతీయ ఆస్పత్రుల్లో టీబీ మందులను ఉచితంగా అందిస్తున్నారు.

లక్షణాలు: విపరీతమైన దగ్గు, ఛాతీలో నొప్పి, తలనొప్పి, నీరసం, జ్వరం, అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చలి వేయడం, రాత్రి వేళ చెమటలు పట్టడం.

క్షయ నిర్మూలనే లక్ష్యం



జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించే దిశగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా మా సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి జిల్లాలోని క్షయ బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మందులు ఇస్తున్నారు. ఈ వ్యాధిగ్రస్థులు ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

- డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి

ఇంట్లో వాళ్లూ జాగ్రత్తగా ఉండాలి



మూడు వారాల కంటే ఎక్కువగా దగ్గు ఉంటే దానిని క్షయగా నిర్ధారిస్తారు. ఇది అంటువ్యాధి. కాబట్టి దీని బారిన పడిన వారు ఇంట్లో ఉంటే మిగిలిన వారూ జాగ్రత్తగా ఉండాలి. రుయాస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో అవసరమైన మందులు ఉన్నాయి.

- డాక్టర్ సుబ్బారావు, ఊపిరితిత్తుల, శ్వాసకోశ వైద్య నిపుణుడు, రుయాస్పత్రి

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మళ్లీ.. స్వర్ణమ్మను చెరబట్టారు



స్వర్ణమ్మను చెరబడుతున్నారంటూ జనవరి 26న ప్రచురితమైన కథనం



ఆదివారం రాత్రి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు



శ్రీకాళహస్తిలో మట్టి దొంగలపై ఫిబ్రవరి 8న ప్రచురితమైన కథనం

'ఓం నమశ్శివాయ' అంటూ శివనాస్మరణ వినబడుతూ ఉంటుంది. ముక్కంటి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలతో సందడిగా ఉంటుంది. అలాంటి చోట.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపాన ఆదివారం రాత్రి ఓ ఎక్స్‌కవేటర్ దడదడమంటూ శబ్ధం చేస్తూ ఇసుక తవ్వుతోంది. ట్రాక్టర్లకు నింపుతోంది. ఆ ఇసుక ట్రాక్టరు ఆలయం నుంచి పొన్నాలమ్మ గుడివైపు వెళ్లే వంతెనపై వాయువేగంతో వెళుతూ భక్తులను భయాందోళనకు గురిచేసింది. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. 20 ఏళ్ల నుంచి పట్టణ పరిధిలో ఇసుక తవ్వకాలు జరగలేదు. రెండు నెలల కిందట కొందరు ఏకంగా ముక్కంటి ఆలయానికి ఎదురుగా ఉన్న స్వర్ణముఖి నదిలో పట్టపగలు, విచ్చలవిడిగా ఇసుక తవ్వేశారు. దీనిపై ఈ ఏడాది జనవరి 26వ తేదీన 'శివయ్యా.. స్వర్ణమ్మను చెరబడుతున్నారు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దాంతో ఇక్కడ తవ్వకాలకు అడ్డుకట్ట పడింది. మళ్లీ శ్రీకాళహస్తిలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. గత నెలలో మహాశివరాత్రి సందర్భంగా పార్కింగ్ ప్రాంతం కేటాయింపు కోసం స్వర్ణముఖి నదిలో రోడ్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడా రోడ్డు ద్వారా ఆదివారం రాత్రి అక్రమార్కులు నదిలో ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. యంత్రాలతో ఇసుక తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు స్వర్ణముఖి నది నుంచి ఇసుకతో ముక్కంటి ఆలయం ముందు నుంచే అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్లు వెళుతున్న వేగాన్ని చూసి భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇలా.. పట్టణ నడిబొడ్డున ఏకంగా యంత్రాలతో తవ్వుతూ మళ్లీ.. స్వర్ణమ్మను చెరబట్టారు. మరీ ఇంత దాష్టీకమా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

చెలరేగిన గ్రావెల్ మాఫియా

తొట్టంబేడు మండలం శివనాథపాళెం వద్ద గ్రావెల్ మాఫియా మళ్లీ చెలరేగిపోయింది. ఒకటిన్నర నెలపాటు స్తబ్ధుగా ఉన్న అక్రమార్కులు.. మళ్లీ ఆదివారం రాత్రి తవ్వకాలు చేపట్టారు. తెలుగు గంగ కాలువ పక్కన ఉన్న చెరువులో నుంచి ఏకంగా అక్రమంగా రోడ్డును నిర్మించేశారు. రాత్రి వేళల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వి.. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారు. దీనిపై ఫిబ్రవరి 8వ తేదీన 'శ్రీకాళహస్తిలో మట్టి దొంగలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కొన్నాళ్లపాటు గ్రావెల్ అక్రమ రవాణాను ఆపారు. మళ్లీ ఆదివారం రాత్రి రెండు ఎక్స్‌కవేటర్లు, పది టిప్పర్లు, 20 ట్రాక్టర్లతో గ్రావెల్ తవ్వకానికి దిగారు.

టెంకాయ చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు ● రాష్ట్ర సరిహద్దులో ప్రమాదం



మృతి చెందిన సంధ్రీన్ ఫాతిమా



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ముంబైలోని ఓ సంస్థలో పనిచేస్తున్న చెన్నై వేలచ్చేరికి చెందిన మహ్మద్ అవాజ్ కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చారు. స్థానికంగా ఇంజనీరింగ్ చదువుతున్న స్నేహితులు యోగీశ్వరన్, బెంజిమన్, ఆలీయా బేగం, శ్రీమాన్, మాదేష్, సంధ్రీన్ ఫాతిమా, దీనదయాళ్‌తో కలిసి ఆదివారం ఉదయం వరదయ్యపాళెం వద్దనున్న ఉబ్బలమడుగుకు అద్దె కారులో బయలుదేరారు. సరిహద్దులోని పన్నంగాడు వద్ద అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ తోపులోకి దూసుకెళ్లి.. ఓ చెట్టును ఢీకొంది. కారు నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ అవాజ్ వెనుక కూర్చొన్న సంధ్రీన్ ఫాతిమా(21) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన మిగిలిన ఏడుగురిని ఎలావూరు ఆస్పత్రికి.. తర్వాత చెన్నైలోని స్టాండ్లీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ దీనదయాళ్(34) మృతి చెందారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంధ్రీన్ ఫాతిమా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలో పోలీసు శాఖ ప్రక్షాళన!

- భారీగా బదిలీలకు కసరత్తు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో ఇప్పటికే భారీగా పోలీసు బదిలీలు జరిగాయి. ఇప్పుడు తిరుపతి జిల్లాలోనూ పోలీసు శాఖ ప్రక్షాళనకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దృష్టి పెట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా బదిలీలు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి మరో 10 రోజుల్లో కసరత్తు పూర్తి చేయనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఎవరు? గతంలో ఏకపక్షంగా వ్యవహరించిన వారు.. ఇప్పటికీ తీరు మార్చుకోని వాళ్లతో పాటు సమర్థంగా విధుల నిర్వహణ, క్రమశిక్షణ, కేసుల నమోదు, బాధితులకు న్యాయం అందించడంలో ముందుంటున్న వారి గురించీ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. స్పెషల్ బ్రాంచ్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం. సీఐలతో పాటు 40 మందికిపైగా ఎస్ఐలు, 480 మందికిపైగా ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

నెలబల్లికి చేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



దొరవారిసత్రం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'సురక్షిత తీరం.. సమృద్ధి భారత్' పేరిట కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) చేపట్టిన సైకిల్ ర్యాలీ.. ఆదివారం దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలోని వాసవి ఆశ్రమానికి చేరింది. స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈనెల పదో తేదికి 55 వసంతాలు పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ సముద్ర తీరప్రాంత ప్రజలలో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించేందుకు సైకిల్ ర్యాలీ చేపట్టింది. 60 మంది సీఐఎస్ఎఫ్ బృందంతో ఈనెల 7న వెస్ట్ బెంగాల్‌లోని బక్కాలీలో ప్రారంభమైన సైకిల్ ర్యాలీ.. సోంపేట, శ్రీకాకుళం, విశాఖపట్నం, అన్నవరం, అమలాపురం, మచిలీపట్నం, చీరాల, ఒంగోలు, కావలి, నాయుడుపేట మీదుగా దొరవారిసత్రం మండలం నెలబల్లికి చేరింది. సూళ్లూరుపేట, తడ మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుందని సీనియర్ కమాండెంట్ కార్తికేయన్ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



లారీ, ప్రైవేటు కర్మాగారం బస్సు ఢీ

- ఆపై అదుపు తప్పి వాగులో పడ్డ బస్సు ● 15మందికి గాయాలు



వాగులో పడిన బస్సు

శ్రీకాళహస్తి/వెంకటగిరిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కర్మాగారం బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో బస్సు అదుపు తప్పి వాగులో పడింది. దీంతో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఎంపేడు సమీపంలో ఆదివారం జరిగింది. తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఓ ప్రైవేటు సెల్‌ఫోన్ కర్మాగారానికి చెందిన బస్సు వెంకటగిరి నుంచి 15మంది సిబ్బందితో బయలుదేరింది. రాయచోటికి చెందిన రాజు కృష్ణపట్నం పోర్టుకు లారీతో వెళ్తున్నాడు. ఎంపేడు వద్ద లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అదుపు తప్పిన బస్సు పక్కనే ఉన్న వాగులో బోల్తా పడింది. క్షతగాత్రులకు స్థానికులు సహాయక చర్యలందించారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడుకు చెందిన బస్సు డ్రైవర్ మునీంద్ర, వెంకటగిరి సమీపంలోని లింగసముద్రానికి చెందిన శివాజీ, లారీ డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డారు. గుండ్లకుంటకు చెందిన ప్రసాద్, వెంకటగిరికి చెందిన కుశల్, రాపూరు యశోద స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఆరుగురుని 108 వాహనంలో చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన, మునీంద్ర, శివాజీ, రాజును తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనా స్థలంలో స్వల్పంగా గాయపడిన 9మంది క్షతగాత్రులు వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రతిష్ఠాత్మకంగా ముత్యాలమ్మ జాతర


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో జాతర నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25నుంచి 28వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతరను విజయంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించామని చెప్పారు. భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను అందుబాటులో ఉంచామన్నారు. జాతర ముగిసిన తరువాత 28వ తేదీన కూడా బస్సులను నడిపేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దారు శ్రీనివాసులు, ఈవో నవీన్‌కుమార్, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పేటేటి చంద్రనీల్, ఒబ్బాయి శివకుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ్, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

మాధవ నాయుడి జన్మదిన వేడుకలు


మాధవనాయుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, పెరుమాల్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో జరిగాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకుల సమక్షంలో మాధవనాయుడు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, ఏజీ కిషోర్, వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు, బొమ్మిణ పళణి తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ఈనెల 28న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం తడలో ఏఐటీయుసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో పలు రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్‌లకు సంబంధించిన కార్మికుల నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ సంస్థల నుంచి ఒకశాతం సెస్ వసూలు చేస్తున్నారని, దానిని రెండు శాతానికి పెంచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నాయకులు రవి, శ్రీనివాసులు, కుమార్, చల్లయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయండి


మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు, నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో వైసీపీ నాయకులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం జరగదని, ప్రతి కౌన్సిలర్‌తో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు.

సామంచిని కలిసిన బీజేవైఎం నాయకులు


సామంచి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

గూడూరు అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌ను గూడూరుకు చెందిన బీజేవైఎం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని బీజేపీ కార్యాలయంలో సామంచి శ్రీనివాస్ కలిసిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగవద్గీత క్యాలెండర్‌ను త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక, శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47 తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ క్యాలెండర్‌లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, భగవద్గీత శ్లోకాల సారం గురించి ప్రచురించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లా సమన్, శ్రీనివాసులు, అమరావతి, చామంతి, వెంకటలక్ష్మి, కృష్ణ ప్రబోధ, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 9 గంటల నుంచి గ్రీవెన్స్ డే

చిల్లకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి గ్రీవెన్స్ డే నిర్వహించనున్నామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే సంద ర్భంగా 9నుంచి 1గంట వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నాయుడుపేట టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పట్టణంలో విద్యుత్ వినియోగం పెరగడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ తెలిపారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు

కోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు క్రాస్‌రోడ్డులో ఆదివారం మోటారు బైక్ బోల్తా కొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యానగర్‌కు చెందిన రవి, ప్రసన్న మోటారు బైక్‌లో తూర్పు కనుపూరుకు వెళ్తుండగా కొక్కుపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బోల్తా కొట్టారు. ఈ ఘటనలో బైక్‌లో వెళ్తున్న రవి ప్రసన్నకు గాయాలు కాగా, స్థానికులు కోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



వరద సమయంలో కోతకు గురైన రోడ్డు - మధ్యలో భారీ గుంత

మానని వరద గాయం

- కొరిడి - పేర్నాడు రోడ్డుకు గుంతలు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండేళ్ల వచ్చిన వరదలకు తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి - పేర్నాడు రోడ్డు పులికాట్ సరస్సు నీటి ఉధృతికి కోతకు గురైంది. రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గోతులుపడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2023లో వచ్చిన మిచౌంగ్, 2024లో వచ్చిన ఫెంగల్ తుపాన్ ప్రభావంతో పులికాట్ సరస్సుకు భారీగా వరదనీరు చేరింది. వరద ఉధృతికి అట్టకానితిప్ప నుంచి కొరిడి - పేర్నాడు రోడ్డు దాదాపు 3 కిలో మీటర్ల వరకు ఇరువైపులా కోతకు గురైంది. శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు నుంచి అట్టకానితిప్ప నుంచి పేర్నాడుకు పులికాట్ సరస్సు మధ్యలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అటవీశాఖ అడ్డంకులతో తారురోడ్డు నిర్మాణం నేటికీ నెరవేరలేదు. ఉన్న గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారడంతో తీరప్రాంత గ్రామ ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. తీర ప్రాంతంలోని కొరిడి, దామరాయి, కడపత్ర మూడు పంచాయతీ పరిధిలో దాదాపు 23 గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డేగతి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టివేసిన పాపానపోలేదు. వరుసగా రెండు తుఫాన్లు రావడంతో రోడ్డు కోతకు గురైనా కనీసం మరమ్మతులు చేయలేదు. దాదాపు మూడు కిలో మీటర్ల మేర రోడ్డుపై గోతులు పడటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలైతే ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవతీసుకుని తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేనేత కార్మికుల జీవనోపాధిని మెరుగునకు చర్యలు


మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

గూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు, వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చేనేత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల ఇళ్లకు 100 యూనిట్లు వరకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేబినేట్‌లో నిర్ణయాన్ని తీసుకుని ప్రకటించడంతో నేతన్నలు హర్షం తెలుపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేతల సంక్షేమాన్ని విస్మరించిందని, ఎటువంటి రాయితీలు ఇవ్వలేదని నేతన్నలు చెబుతున్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఉచిత విద్యుత్ హామీని తుంగలో తొక్కేశారని విమర్శిస్తున్నారు. చెబుతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత కార్మికుల కుటుంబాల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన కొద్ది నెలల్లోనే 100 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే వారు బిల్లులు చెల్లించే అవసరం లేకుండా ఆదేశాలను జారీ చేసింది. మరింత మంది నేతన్నలకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో దీనిని 200 యూనిట్లకు పెంచడంతో వారితో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో 500, విందూరు గ్రామంలో 40 వరకు చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనుండడంతో సుమారు 320కు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. చేనేత కార్మికులు గుర్తింపు కార్డుతో విద్యుత్‌శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఈ పథకం వర్తిస్తుందని చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అర్హులైన చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి. 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకుంటున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా ఎంతో మందికి లబ్ధిచేకూరుతుంది.

\- కటికాల శ్రీనివాసులు, చేనేత సంఘ నాయకుడు, చెన్నూరు



సూళ్లూరుపేటలో రాత్రిపూట చెత్త తొలగిస్తున్న సిబ్బంది - తెల్లారేసరికి తళతళ మెరుస్తున్న బాపూజీవీధి

సూర్యోదయానికల్లా వీధులన్నీ తళతళ

మున్సిపాలిటీ రాత్రివేళ పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉదయం చూసేసరికి సూళ్లూరుపేటలోని కూరగాయల మార్కెట్ సెంటర్, ప్రధాన కూడళ్ల, బజారు వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతుండేవి. కాలువల్లో వ్యర్థాలు తేలుతూ దుర్గంధం నిండేది. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు దాదాపు 25టన్నుల మేర చెత్త పోగవుతోంది. 136 మంది పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములవుతున్నారు. ఇంతమంది ఉన్నా రాత్రయ్యేసరికి పట్టణంలోని ప్రధాన వీధులు, జీఎస్‌టీ రోడ్డు చెత్త చెదారం, వ్యర్థాలతో అధ్వానంగా ఉంటున్నాయి. కచ్చేరి, బాపూజీ, పొట్టి శ్రీరాములు వీధులతో పాటు కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రోడ్లపై వ్యర్థాలు నిండిపోతున్నాయి. కొన్ని సమయాల్లో ద్విచక్ర వాహనాలు కూడా పోలేని పరిస్థితి. ఉదయం పారిశుధ్య సిబ్బంది వచ్చి వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లేసరికి మధ్యాహ్నం అయిపోతోంది. పట్టణ సుందరీకరణకు ఇది ప్రధాన అడ్డంకిగా మున్సిపాలిటీ అధికారులు భావించారు. ఈ పరిస్థితిని మార్చడానికి రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం బజారు ప్రధాన వీధులతో పాటు కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రాత్రి సమయాల్లో 8 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించారు. వీరు రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు పనులు చేస్తున్నారు. ఇంకేముంది.. తెల్లారి చూసే సరికి రహదారులు తళతళమని మెరుస్తున్నాయి.

విద్యా వికాసానికి క్రీడా పోటీల దోహదం

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు గెలుపోటముల కోసం కాదని, వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు ఆదివారం జరిగింది. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా కోట మండలంలోని ఎన్‌బీకేఆర్ కళాశాల జట్టు నిలిచాయి. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీయూ అనంతపురం విన్నర్ కాగా, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ జట్టు నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ రన్నర్‌గా నిలిచింది.

రైల్వేస్టేషన్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు

నాయుడుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ రైల్వే యూజర్స్ కన్సలేటివ్ కమిటీ మెంబరు(డీఆర్‌యుసీసీ) పేర్నాటి జోసెఫ్, సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు మస్తానయ్య, కార్యదర్శి రాఘవన్, కిరణ్, ఆధ్వర్యంలో ఆదివారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయశ్రీ, ఎంపీ గురుమూర్తి సహకారంతో వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌యుసీసీ సభ్యులు జోసెఫ్, మస్తానయ్య, రాఘవన్ తదితరులు

రక్తదానంతో ప్రాణదానం


రక్తదాన శిబిరంలో జనసేన నాయకులు

గూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సినీహీరో రామ్‌చరణ్ తేజ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, కార్తీక్, సునీల్, రవి, మనోజ్, గురుబాబు, మహేష్, సాయి, సనత్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సినీహీరో రామ్‌చరణ్ తేజ జన్మదినం పురస్కరించుకొని చిరంజీవి సేవాసంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 మంది రక్తదానం చేసినట్లు చిరంజీవి సేవాసంఘం సభ్యుడు మాబాషా తెలిపారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్, హరిబాబు, కోటి యాదవ్, తేజయాదవ్, రమణ, దాస్, శ్రీమన్, సాయి, శివ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి యువకుడి మృతి చెందిన ఘటన వెంకటగిరి సమీపంలో జరిగింది. రైల్వే ఇన్‌చార్జి ఎస్‌ఐ మాలకొండయ్య తెలిపిన వివరాలు... బెంగళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ యువకుడు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ చెప్పారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

పెళ్లకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు బెట్టింగ్‌లకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... బెట్టింగ్ గేమింగ్‌లు నిర్వహించే వారిపై సాంకేతికత సాయంతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో యువత బెట్టింగ్ గేమింగ్‌ల యాప్‌ల వలలో పడి అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు.

చెత్త కుప్పకు నిప్పు



వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనందపురంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చెత్తకు నిప్పంటించడంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు 101కు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ సదర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్యాస్, విద్యుత్, పేలుడు పదార్థాలు వాడుతున్నపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానికులు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని చెత్త ఇక్కడే వేయడంతో డంపింగ్ యార్డ్‌లా మారిపోయిందన్నారు. ఎన్నోసార్లు మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఇక్కడి నుంచి చెత్త తొలగించాలన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయ లెక్కింపు సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధ్యాత్మికత, సేవకు ప్రతిరూపం రంజాన్


రంజాన్ కిట్లు అందజేస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ప్రతినిధులు

గూడూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, సేవకు రంజాన్ మాసం ప్రతిరూపంగా నిలుస్తుందని నియోజకవర్గ ముతవల్లి కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌రహీం అన్నారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో మహ్మ దీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మత సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, ఇమామ్ హరూన్, రఫీ, బాబర్, అన్వర్, ఆజాద్, రహీం, కరిముల్లా, యూసఫ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక బజారు కూడలిలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు కత్తి రవి, నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మ వారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణ చేశారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వయోజనులకు ఉల్లాస్ పరీక్షలు

కోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 32 కేంద్రాల్లో ఆదివారం వెలుగు ఏపీఎం అనిల్ ఆధ్వర్యంలో వయోజనులకు ఉల్లాస్ పరీక్షలు జరిగాయి. మొత్తం 304 మంది వయోజనులు పరీక్షలు నిర్వహించారు.